ఓం నమో భగవతే శ్రీరమణాయ



# రమణభాస్కర



## (భీమవరంలో శ్రీనాన్నగారి ప్రవచనము, 31-8-97)

**ప్రియమైన ఆత్మబంధువుల్లారా !**

నీస్వరూపాన్ని నీవు పొందే వరకూ నీకు శాంతిలేదు, సుఖంలేదు, ఆనందంలేదు. నీ స్వరూపాన్ని నీవు తెలుసుకోవాలంటే నీకు దైవీసంపద ఉండాలి, కళ్యాణగుణాలు ఉండాలి. ఆ గుణాలు నీకు ఉంటే సరే లేకపోతే వాటిని సంపాదించుకోవాలి. ఎక్కడైతే ఈశ్వరుడు ఉన్నాడో ఆ హృదయగుహలోనికి మీ మనస్సును పంపటానికి దైవీసంపద, కళ్యాణగుణాలు మీకు సహకరిస్తాయి. దైవీగుణాలు ఉన్నవాడికి జ్ఞానము కలుగుతుంది, పరమస్థితిని పొందుతాడు. మీకు ధనంపెరిగినా బుద్ధిలో నాణ్యత పెరగదు. కొంతమంది భౌతికంగా మనుషులు బాగానే ఉంటారుగాని జీవితంలోక్వాలిటీ ఉండదు. భగవాన్ మాటలు మీరు అర్థం చేసుకొంటే మీ లోపల గుణసంపద పెరుగుతుంది, మీ జీవితం యొక్క క్వాలిటీ పెరుగుతుంది. ఇవి మీ హృదయంలో ఉన్న వస్తువును తెలుసుకోవటానికి మీకు సహకరిస్తాయి.

నాకు తెలుసును, నాకు తెలియదు అనుకోవటం మానసికవృత్తి. సత్యవస్తువు వీటికి అతీతంగా ఉంది. హృదయంలో ఉన్న చైతన్యం ఎవడికైతే తానుగా వ్యక్తమయ్యిందో అది నిజమైన జ్ఞానం. భగవంతుడు ఉన్నాడా, లేడా అనే సందేహాలు పెట్టుకోవద్దు. మీ ఆధ్యాత్మిక అభివృద్ధికి మీ సందేహాలే అడ్డువస్తాయి.

నిజస్థితిని పొందేవరకూ నీకు కదలిక తప్పదు, పునర్జన్మ తప్పదు, కర్మానుభవం తప్పదు, మనస్సుకు చాపల్యం తప్పదు. నిజస్థితిని పొందేవరకూ వాడు ఎంత పండితుడు అయినా, ఎంత భక్తుడు అయినప్పటికి మనస్సు యొక్క చాపల్యం ఆగదు. నది ఎన్ని వంకరలు తిరిగినా సముద్రంలోనికి వెళ్ళి చేరేవరకూ దాని ప్రయాణం ఆగదు. ఇది నిజంకాదు, ఇది నిజంకాదు, అని నీబుద్ధి ప్రయాణం చేస్తూ ఉంటుంది. నీహృదయంలో ఉన్న నిజం తెలిసేవరకూ నీబుద్ధికి శాంతి కలుగదు, శాశ్వతమైన స్థితిని అందుకోలేదు. నిజంకానిదానిని నిజం అనుకొంటాము. అది తెలిసాక ఇందులో కూడా నిజంలేదని మనకు తెలుస్తుంది. ఇలా అనేక జన్మలు పాడుచేసుకొంటాము. నీహృదయంలో నీవు ఉండటమే నిజమైన ఆసనము. నీఇల్లుఏది అంటే మోక్షము, శాంతి, పరమసుఖము. అది నీహృదయంలోనే ఉంది. ఆఇంటికి నీవు వెళ్ళేవరకూ ఈ కొంపలు మార్చటం, దేహాలు మార్చటం తప్పదు. ఈలోకాలు తిరగటం తప్పదు. మోక్షం అనే ఇల్లును ఇటుకలతో కట్టనక్కరలేదు. అది నీహృదయంలోనే ఉంది. నీఇంటికి నీవు వెళ్ళిపో. అక్కడకు చేరితే శాశ్వతమైన స్థితి కలుగుతుంది. మోహంనుండి బయటపడతావు. నీవు ఎంత తెలివైనవాడివి అయినప్పటికి నీ బుద్ధికి నీహృదయంలో ఉన్న నిజం తెలిసేవరకూ నీకు తిప్ప;లు తప్పవు. నీకు ఈమాటలు నచ్చవచ్చు నచ్చకపోవచ్చును. ఇవి ఒక ఋషి చెప్పినమాటలు. ఒకఋషి చెప్పిన మాటలు కలకాలం ఉంటాయి. ఆ మాటలను మనం

అనుమానించకూడదు. లోకప్రయోజనం దృష్టిలో పెట్టుకొని గాని, గొప్పలకోసం గాని ఋషిమాటలు చెప్పడు. శాశ్వతంగా ఉండేమాటలను ఋషి చెపుతాడు.

దేహబుద్ధి నశిస్తే మోక్షము అనే నిజమైన ఇంటికి నువ్వు చేరుకొంటావు. ప్రపంచాన్ని విడిచిపెట్టి ఎక్కడికి పారిపోనక్కరలేదు. మీ మనస్సు హృదయాభిముఖంగా ప్రయాణం చేయటానికి ప్రయత్నం చేయండి. సమాజమును, పంచభూతములను విడిచిపెట్టి ఎక్కడికో పారిపోతే వచ్చేదికాదు. నాకు ఏమీ అక్కరలేదు అని ఇంటిదగ్గర నుండి పారిపోయివచ్చాను. కాని ఇక్కడ పెద్ద కుటుంబం తయారయ్యింది అన్నారు భగవాన్. ఇంటి దగ్గర అయితే నలుగురు, అయిదుగురు ఉంటారు కాని ఆశ్రమంలో వందలమంది ఉంటారు. ప్రపంచంలో ఉండగానే, ఈ దేహంలో ఉండగానే దైవీ సంపద సంపాదించి నీ హృదయంలో ఉన్న నిజస్థితిని పొందటానికి ప్రయత్నంచెయ్యి. నిజస్థితిని పొందలేవు అనుకో జన్మలు తప్పవు. నిర్వాణస్థితి తప్పించి అన్నీ కాల ప్రవాహములో కొట్టుకొని పోతాయి. చిల్లర విషయాలమీద గురిపెట్టవద్దు. నిజస్థితిని పొందటానికి ప్రయత్నం చెయ్యి.

నీ మూలంలో నీవు ఉంటే సుఖంగా, శాంతిగా ఉండగలవు. దైనందిన జీవితంలో జరిగే సంఘటనలకు రియాక్టు అవ్వవు. నీ హృదయంలో నీవు ఉండగలిగితే ద్వైత బుద్ధి ఉండదు; రాగము, ద్వేషము, భయము ఉండదు. మనం హృదయంలోనికి వెళ్ళిపోదాము అని అనుకొంటే మన గుణాలు ఎక్కడికి పోతాయి. ఎవడో కనిపిస్తాడు వాడిమీద అసూయ కలుగుతుంది. మనస్సును హృదయంలోనికి పంపాలి అని అనుకొన్నా అసూయ మనస్సును బయటకు లాగేస్తుంది. ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి రావాలంటే ఇతరులమీద అసూయను ముందు విడిచిపెట్టాలి. ఇతరులపట్ల శాంతిగా ఉండాలిగాని అసూయగా ఉండకూడదు. నీకు అసూయ పెరుగుతూ ఉంటే మనస్సు బాహ్యముఖానికి వచ్చేస్తుంది. శాంతిగా ఉంటే మనస్సు అంతర్ముఖం అవ్వటానికి సహకరిస్తుంది హృదయంలో నీవు ఉండగలిగితే సుఖంగా ఉంటుంది. అదే సుఖాసనము. అది సంతోషమును కలుగజేస్తుంది. అక్కడ శాంతిగా ఉండగలవు. హృదయాసనం పొందినవాడికి ఇతర ఆసనములతో పనిలేదు. వాడికి దేహం ఉన్నా, ఊడిపోయినా ఒక్కటే.

కర్తలేని కర్మను చేయమన్నాడు కృష్ణుడు. దేహబుద్ధి లేకుండా పనిచేయమని చెప్పాడు. రాగద్వేషములతో పనిచేస్తూ కృష్ణుడు చేయమన్నాడు మేము పని చేస్తున్నాము అంటారు. రాగద్వేషములతో పనిచేయటం కాదు. దేహబుద్ధిలేకుండా నీవు పనిచేస్తే అది నిష్కామకర్మ. నిష్కామకర్మ నీవు కొంచం చేసినా మనస్సు హృదయాభిముఖంగా ప్రయాణం చేయటానికి అది నీకు ఎంతో సహకరిస్తుంది. పని పనికోసమే నీవు చేయగలిగితే నీ హృదయంలోని నిజస్థితిని పొందటానికి అది నీకు సహకరిస్తుంది. మానవుడికి దుఃఖానికి కారణం వాడు చేస్తున్న పనికాదు. ఇది నేను చేస్తున్నాను అనే తలంపే దుఃఖానికి కారణం. కొంతమంది వాళ్ళలో వాళ్ళే మేము మంచివారము అనుకొంటారు. దీనివలన ప్రమాదం ఏమిటి అంటే ఎవరైనా వారిని చెడ్డవారు అంటే వెంటనే వారికి దుఃఖం వచ్చేస్తుంది. మేము మంచివారము అని అనుకోకపోతే ఇతరులు ఎవరైనా చెడ్డవారు అన్నా వారికి దుఃఖంరాదు.

వ్యక్తి భావన లేకుండా పనిచేస్తే ఆధ్యాత్మికంగా అభివృద్ధి పొందటానికి ఆపని నీకు సహకరిస్తుంది.

నీవు ఏ మార్గంలో ప్రయాణం చేసినా, ఏ గురువును ఆశ్రయించినా నేను అనే మూల తలంపును తగ్గించుకొంటూ రావాలి. దేహగతమైన నేను లేకపోతే పని జరగదేమో అని అనుకొంటారు. అహంభావన పోయిన తరువాత కూడా నీవు పని చేస్తూనే ఉంటావు. ఎందుకంటే నీదేహాన్ని ఈశ్వరుడు స్వాధీనం చేసుకొంటాడు. అహంభావన పోయిన వాడి దేహం దేవాలయం అవుతుంది. నీదేహం ఇప్పుడు జీవుడు స్వాధీనంలో ఉంది. జీవలక్షణాలు పోయిన తరువాత ఈ దేహాన్ని ఈశ్వరుడు స్వాధీనం చేసుకొంటాడు. ఎప్పుడయితే ఈశ్వరుడు మీ దేహాన్ని స్వాధీనం చేసుకొన్నాడో ఈశ్వరుడే మీకు ఆత్మస్వరూపంగా వ్యక్తమవుతాడు. అప్పుడు ఈశ్వర సంకల్పాన్నిబట్టి మీదేహం పనిచేస్తుంది. అప్పుడు మీకు దుఃఖం రావలసిన పనిలేదు. మనం అనుకొన్న పని అవ్వకపోతే మనకు దుఃఖం వస్తుంది. అనుకొన్నది జరగకపోతే ఈశ్వర సంకల్పం అలా ఉందేమో అనేవారు భగవాన్. ఈశ్వర సంకల్పము అలా ఉన్నప్పుడు ఎవరు దానిని ఎదుర్కోగలరు. ఈశ్వరసంకల్పం అత్యంతబలీయమైనది. ఈశ్వర సంకల్పముతో జ్ఞాని తాదాప్యంపొంది ఉంటాడు అక్కడ బేధం కనిపించదు.

మరణకాలములో మనకు మంచి తలంపులు రావాలి. దానికి ఇప్పటినుండి ప్రాక్టీసు చేయాలి. ప్రాక్టీసు చేసినా మంచి తలంపులు వస్తాయని నిర్ధారణలేదు. మరణకాలంలో మనం అనుకొన్నది రాదు, మన హృదయంలో మనకు ఏది ఇష్టమో అది వస్తుంది. దానిని బట్టి మనకు పునర్జన్మ నిర్ణయిస్తారు. అహంభావన పోయిన తరువాత నీవు బద్ధకస్తుడవు అయిపోతావు అని అనుకోవద్దు. నీ ద్వారా ఏదో పని జరుగుతూనే ఉంటుంది. దేహం ఏ పని నిమిత్తం ఈభూమిమీదకు వచ్చిందో ఆపని పూర్తి అయ్యేవరకు ఈదేహం మరణించదు. ఈదేహంలో పొందవలసిన అనుభవాలు పొందేవరకు దేహము, జీవుడు సెపరేట్ అవ్వరు. ఈదేహం ఏపని నిమిత్తం వచ్చిందో ఆపని పూర్తి అయ్యేవరకు నేను కర్తను అని అనుకొన్నా, నేను కర్తను కాదు అని అనుకొన్నా నీదేహం ద్వారా ఆపని పూర్తి అయిపోతుంది. నేను కర్తను అనుకొంటే నీకు దుఃఖం వస్తుంది. నేను కర్తను కాదు అని అనుకొంటే నువ్వు సుఖివి అవుతావు. నేను కర్తనుకాదు అన్నసంగతి నీకు తెలిస్తే నీకు సుఖం, శాంతి, ఆనందం కలుగుతుంది. దుఃఖము, భయము, ఇష్టము, అయిష్టము, మరణము, పుట్టుక అన్నీ తలంపు రూపంలో వస్తాయి జీవితం అంతా తలంపులే. ఈ తలంపులు అన్నీ అహంభావనకే వస్తున్నాయి. తలంపులు లేని వస్తువు ఒకటి నీహృదయంలో ఉంది. దానిని పొందటానికి ప్రయత్నం చెయ్యి.

తాను కర్తను అని అనుకొన్నా, అనుకోకపోయినా ఆ దేహం ద్వారా జరగవలసిన పని జరిగిపోతుంది. ఒకడు రైలులో ప్రయాణం చేస్తున్నాడు. అతని వద్ద ఒక పెట్టె ఉంది. తన బరువును, పెట్టె బరువును కూడా రైలు మోస్తోంది. రైలుకు బరువు తగ్గించాలి అనుకొని పెట్టెను నెత్తిమీద పెట్టుకొన్నాడట. వాడు చేసిన పని మనకు వెర్రితనంలాగ అనిపిస్తోంది. కాని అదే పని మనం కూడా చేస్తున్నాము. వాడి తలమీద ఉన్నప్పుడు, ప్రక్కన ఉన్నప్పుడు కూడా ఆ బరువును రైలే మోస్తోంది. తలమీద పెట్టుకొంటే నీకు భారం అవుతుంది, ప్రక్కన ఉంటే నీకు భారం ఉండదు. అదే విధంగా ఈశ్వరసంకల్పము ప్రకారం జరిగేది జరుగుతూ ఉంటుంది. కర్తృత్వం పెట్టుకొంటే నీ తలమీద పెట్టె పెట్టుకొన్నట్లు, పెట్టె క్రింద పెట్టావు అనుకో కర్తృత్వమును వదిలివేసినట్లు. పెట్టె క్రిందపెట్టినంత మాత్రంచేత రైలు పెట్టెను వదిలి వేయటంలేదు. నిన్ను, పెట్టెను కూడా రైలు గమ్యానికి తీసుకొని వస్తోంది. కర్తృత్వం లేనంత

మాత్రంచేత నీ ద్వారా జరగవలసిన పని జరగదేమో అని సందేహం పెట్టుకోవద్దు. నీకు కర్తృత్వం లేకపోతే నీ దేహంద్వారా జరగవలసిన పని పూర్తి అయిపోతుంది, నీప్రారబ్ధం నశిస్తుంది, దుఃఖం నిన్ను ముట్టుకోదు. కర్తృత్వం లేకుండా ఏమానవుడు అయితే ఉన్నాడో వాడు కర్మయేగి. నీవు చేసే పని చిన్నదా, పెద్దదా అనేదికాదు. నీవు ఏపని చేస్తున్నావో భగవంతుడు చూడడు. చేసేపని ఎలా చేస్తున్నావో చూస్తాడు. ఈశ్వర ప్రీతికోసం చేస్తున్నావా, గొప్పలకోసం చేస్తున్నావా అని చూస్తాడు. నీవుచేసేపని చిన్నది అయినా కర్తృత్వం లేకుండా చేస్తే ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి వస్తావు. నీవు చేసేపని పెద్దపని అయినా, మంచిపని అయినా అహంభావనతో చేస్తే పుణ్యం వస్తుందిగాని ఆధ్యాత్మికంగా అభివృద్ధి చెందలేవు.

కృష్ణుడు ఏవిధంగా పనిచేయమన్నాడో అర్థం చేసుకొని ఆవిధంగా పనిచెయ్యి. మనిషి పనిని విడిచిపెట్టకూడదు. పనే మనిషిని విడిచిపెట్టాలి. ఇప్పడు మనం ఎలా పనిచేస్తున్నామో అలా పనిచేయమని కాదు. కర్తలేని కర్మను చేయమని కృష్ణుడు చెప్పాడు. పని ఎలా చేయాలో అర్థం చేసుకొని చేస్తే నీకు అహంభావన తగ్గుతుంది. చిత్తశుద్ధి కలుగుతుంది. అహంభావన లేకుండా చేసేపని వలన నీవు బాగుపడతావు. ఆపని సమాజమునకు కూడా ఉపయోగపడుతుంది. ఏరకంగా పనిచేస్తే నీ మూల తలంపు నశిస్తుందో ఆరకంగా పనిచెయ్యి. కర్మ అంటే ఏమిటో అర్థం చేసుకో? కొంతమంది ఈ పనిని మేమే చేయాలి అంటారు. దేహబుద్ధి యొక్క వేగం అలా ఉంటుంది. గురువు అనుగ్రహం లేకపోతే మనకు తత్వం అర్థంకాదు. దేహము చనిపోతే మనం ఉండము అనే తలంపు వలన మనకు భయం వస్తోంది. భయం వలన దుఃఖం వస్తోంది. శరీరం పోయిన తరువాత కూడా మనం ఉంటాము అన్న సంగతి మనకు తెలియటంలేదు. నీ హృదయంలో మరణం లేని వస్తువు ఒకటి ఉంది. శరీరం ఉండగానే దానిని నీవు పొందగలిగితే మృత్యుంజయుడవు అవుతావు. దేహం చనిపోయినపుడు నేను చనిపోవటంలేదు నేను ఉంటాను అన్నసంగతి నీకు స్పష్టంగా తెలుస్తుంది.

నీవు చేసే పూజ, జపం, ధ్యానం నీచైతన్యస్థాయి పెరగటానికి సహాయపడాలి. ఇతరులకోసం చేయవద్దు. నీకుడిచేతిలో నున్న వస్తువును ఎడమచేతిలో పెట్టుకొంటే నేను త్యాగం చేసాను అని నీవు అనుకోవు. నీవు ఇతరులకు ఏదైనా మంచి చేసినా, సమాజమునకు సేవ చేసినా నీకుడిచేతిలో ఉన్న వస్తువును ఎడమచేతిలో పెట్టుకొంటే ఎలా ఉంటావో అలాగే ఉండు. వారిలోకూడా నిన్నే చూసుకో. మేము ఇన్ని గంటలు పూజ చేసాము, జపం చేసాము అని చెపుతూ ఉంటాము ఇది కూడా అహంభావనలో భాగమే. పూర్ణభక్తి జ్ఞానంతో సమానము. నీలో బేదబుద్ధి ఉన్నంతకాలము నీకు పునర్జన్మ తప్పదు. వేదన, రోదన నిన్ను వెంటాడుతూ ఉంటాయి.

మీకు చెడు స్నేహాలు ఉంటే ప్రయత్నం చేసి వదిలించుకోండి. అప్పడు మీకు సహృదయం కలుగుతుంది. అది మిమ్మల్ని దేవుని వైపుకు త్రిప్పతుంది. ఒక మనిషి బాగుపడాలంటే మంచి స్నేహాలు అవసరము. చైతన్యస్థాయిలో అందరూ ఒకరకంగా ఉండరు. మనకంటే ఎక్కువ చైతన్యస్థాయి ఉన్నవారి స్నేహం చేస్తూ ఉంటే మనం లాభం పొందుతాము. చెడుస్నేహాలను విడిచిపెట్టకపోతే మనం నష్టపోతాము. చెడుస్నేహాలు విడిచిపెట్టటం కూడా సాధనలో ఒక భాగము. నీకు ఏమార్గం ఇష్టమయితే ఆమార్గంలో ప్రయాణం చెయ్యి. గమ్యం ఒక్కటే పూర్వజన్మలలో నీవు ఏమార్గంలో ప్రయాణం చేసావో

ఆమార్గం అంటే నీకు ఇష్టం కలుగుతుంది. ఏమార్గంలో ప్రయాణం చేసినా నీకు పోగొట్టుకోవలసింది ఒక్కటే, దేహాభిమానాన్ని పోగొట్టుకోవాలి. వారు నన్ను తిడుతున్నారు అని భగవాన్‌తో ఎవరైనా చెపితే నిన్ను నీవు ఎలాగ తిట్టుకోలేవు, వారిని తిట్టనియ్యి. వారు తిట్టిన తిట్లను భరించగలిగితే, వాటిని నీవు సహించగలిగితే నీవు ఏదైతే పోగొట్టుకోవాలి అనుకొంటున్నావో అది పోగొట్టుకోవటానికి అవి నీకు సహకరిస్తాయి.

ఒక భక్తుడికి భగవాన్ మీద కోపం వచ్చి భగవాన్‌లో ఆలోపములు ఉన్నాయి, ఈలోపములు ఉన్నాయి అని ఒక పుస్తకం వ్రాసి ముద్రించి రెండు ప్రతులను ఆశ్రమానికి పంపాడట. సర్వాధికారి వాటిని భగవాన్‌కు చూపించి వీడిని వదలకూడదు అని గట్టిగా చెప్పాడట. అప్పుడు భగవాన్ వాడు చాలా పొరపాటు చేసాడు. పుస్తకం వ్రాసేముందు నాదగ్గరకు వచ్చి చెపితే ఇంకా పొరపాట్లు చెప్పి ఉండేవాడిని. వాడికి పెద్దపుస్తకం అయ్యి ఉండేది అన్నారట. ఆయన ఫీలింగ్ ఎక్కడైనా హర్ట్ అయ్యిందా? అవ్వలేదు. ఆయన ఋషి అంటే. మనలను ఎవరైనా ఏమైనా అంటే స్నేహితులు అన్నాకూడా మనకు రాత్రి అంతా నిద్ర పట్టదు. నీహృదయంలో ఉన్న దుఃఖం లేనిస్థితిని అందుకొనే వరకు ప్రతీ జన్మలోను ఏదో రూపంలో దుఃఖం నిన్ను వెంటాడుతూనే ఉంటుంది.

ఇతరులకు సహాయం చేయాలని ఉంది, ఇతరులను ఉద్ధరించాలని ఉంది కర్మయోగిని అవ్వాలని ఉంది అని చెపుతున్నాడు. కర్మయోగిని అవ్వాలని ఎవరికి అనిపిస్తోంది? నీ అహంభావనకే అనిపిస్తోంది. వాడి ఆలోచనలోనే పొరపాటు ఉంది. ఇతరులకు మీద్వారా సహాయం జరగవలసి ఉంటే జరుగుతుంది. సహాయం చేస్తాను అంటున్నాడు వీడు ఎవడు సహాయం చేయటానికి. ఇదీ ఒకరకమైన అహంభావన. ఈప్రపంచం నీవు పుట్టక ముందు ఉంది, నీవు చనిపోయిన తరువాతకూడా ఉంటుంది. నీవు పుట్టక ముందు ఈ ప్రపంచమును ఎవడు చూసాడో వాడే నీవు చనిపోయిన తరువాత దానిని చూస్తాడు. నీకు అహంభావన ఉంటే లోకం, దేవుడు, పుణ్యం, పాపం, పునర్జన్మ, గౌరవం, అగౌరవం అన్నీ ఉంటాయి. అహంభావన ఉన్నంతసేపు ద్వైతం నిన్ను విడిచి పెట్టదు. అహంభావన నశించినవాడికి గౌరవం ఏమిటి? అగౌరవం ఏమిటి?

నాలోకనుక అజ్ఞానం ఉంటే ఇతరులకు బోధించటానికి నాదగ్గర ఏమీలేదు. నేనే కనుక జ్ఞానిని అయితే నాకు బోధించటానికి ఇతరులు లేరు అని ఒక సందర్భములో భగవాన్ అన్నారు. వాడు ఏమి చేసినా ఇతరులను ఉద్ధరిస్తున్నాననే భావన అక్కడ ఉండదు. మన మనస్సులో కనుక చాపల్యం లేకపోతే తగాదాలు ఉండవు. అమెరికాలో ఉన్నవారు మేము అమెరికన్ పౌరులము అనుకొంటారు, ఇండియాలో ఉన్నవారు మేము ఇండియా పౌరులము అనుకొంటారు. అలాకాకుండా అందరూ ప్రపంచ పౌరులు అయిపోతే అప్పుడు ప్రపంచం అంతాశాంతిగా ఉంటుంది. అనుకొంటే ఈప్రపంచం అంతా నాది అని అనుకొని పనిచెయ్యి. అది కర్మయోగము. లేనిచో ఈప్రపంచంలో ఏదీ నాదికాదు అని అనుకో అది జ్ఞాన మార్గము. నువ్వు అటు ప్రయాణం చేసినా, ఇటు ప్రయాణం చేసినా నీకు భగవదనుభవం కలుగుతుంది.

పెద్దలు, మహాత్ములతో సహవాసం చెయ్యండి. జ్ఞానమును సంపాదించుకోండి అని ఎందుకు చెపుతున్నారు అంటే అజ్ఞానమువలన మనకు మానసిక రుగ్మతలు వస్తాయి. ఎప్పుడైతే జ్ఞానమును

సంపాదించామో అప్పుడు అజ్ఞానము వలన వచ్చే రుగ్మతలు అన్నీ నశిస్తాయి. సూర్యుడు ఉదయిస్తేనేగాని చీకటిపోదు అలాగే జ్ఞానోదయం అయితేగాని అజ్ఞానం నశించదు. భౌతికంగా నీకు అన్నీ ఉన్నా శాంతిలేకపోతే నీవు సుఖపడలేవు. అందువలన ముందు నీవు శాంతిని పొందితే నీద్వారా ఇతరులకు శాంతి అందుతుంది. మానవజాతికి అంతకంటే నీవు చేసే ఉపకారం ఏమి ఉంటుంది. శాంతి నీకు ఎక్కడో దూరాన లేదు. నీకు అత్యంత సమీపంలో నీహృదయంలోనే ఉంది. నీకు అవగాహన లేకనీకు అర్థంకావటం లేదు. విశ్వరూపం దర్శించేవరకు అర్జునుడికి కృష్ణుడు గురించి అవగాహన రాలేదు. 24 గంటలు కలిసి తిరిగినా, ఎంత సన్నిహితంగా ఉన్నా ఆమనిషి ప్రోపర్‌గా అర్థం అవ్వకపోతే అతని గురించి మన బ్రెయిన్‌కు పట్టదు. నీవు పనిచెయ్యి. పనికి జ్ఞానానికి విరోధం లేదు. నీమాట, నీచేత నీచైతన్య స్థాయి పెరగటానికి ఉపయోగపడాలి. ఇతరులకు ఉపకారం చేస్తాను అంటున్నావు. నీవు ఆత్మసాక్షాత్కారము పొందితే నీవు ఇతరులకు చల్లదనాన్ని ఇవ్వగలవు. నీవు అనుకోకపోయినా నీద్వారా ఇతరులకు ఉపకారం జరుగుతుంది.

పెద్ద పెద్ద సాధనలు చేయలేకపోయినా నీకంటే ఎక్కువ చైతన్యస్థాయి ఉన్నవారితో సహవాసం చేస్తే నీమనస్సు స్వాధీనంలోనికి వస్తుంది. నీ సాధనలవలన నీమనస్సు లొంగటంలేదు అనుకో మహాత్ముల సన్నిధిలో వారి అనుగ్రహంవలన నీకు తెలియకుండా నీమనస్సు స్వాధీనంలోనికి వస్తుంది. ఒక వేళ మీరు ఏదైనా పొందారు అనుకోండి అది మీ తెలివి తేటలవలన అని అనుకోవద్దు. దేవుని అనుగ్రహం అనుకోండి. ఆయన ప్రసాదం అనుకోండి. నా సాధనవలన ఇది వచ్చింది అనుకొంటే దానివలన గర్వం వస్తుంది. గర్వం వచ్చినప్పుడు దేహబుద్ధి పెరుగుతుంది. దేహబుద్ధి ఎప్పుడైతే పెరిగిందో ఆత్మబుద్ధికి దూరమవుతాము.

**Bear Insult, Bear Injury that is the highest Sadhana says Swami Sivananda**

